www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 21 సెప్టెంబరు 2025

5

పశ్చిమ గోదావరి



జిల్లా వక్తృత్వ పోటీల్లో హైస్కూల్ విద్యార్థినికి ప్రథమ స్థానం



కాళ్ల: జిల్లా వక్తృత్వ పోటీల్లో మాలవానితిప్ప హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానం సాధించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలా నరసింహారావు శనివారం తెలిపారు. అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మాలవానితిప్ప హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న పత్సమట్ల రమాదేవి ప్రథమ స్థానం సాధించి బహుమతిగా రూ.5 వేలు గెలుపొందారు. ఈ బహుమతిని అక్టోబర్ 11న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలా నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, మండలి వెంకట్రాజు, రంగరాజు, ఉపాధ్యాయులు స్వామి, శివలాల్, దుర్గాప్రసాద్, కుమారి, విద్యా కమిటీ ఛైర్మన్ అభినందనలు తెలిపారు.

మృత్యు దారులు..!

రెండు జిల్లాల్లో అధ్వానంగా రోడ్లు

ఏలూరు జిల్లాలో 1800 కిలోమీటర్ల రోడ్ల వ్యవస్థలో సగానికిపైగా ఛిద్రం

పశ్చిమలోనూ ఇదే పరిస్థితి...

కూటమి ప్రభుత్వం వాగ్దానాలన్నీ కాగితాలకే పరిమితం

జంగారెడ్డిగూడెం-ఏలూరు, బుట్టాయగూడెం రోడ్లు అధ్వానం

భీమవరం నుంచి జక్కరం రోడ్డు పరిస్థితీ అంతే..

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'2025 సంక్రాంతి నాటికి రాష్ట్రంలో రోడ్లపై గోతులన్నీ పూడ్చి బాగుచేస్తామని చెప్పిన కూటమి సర్కార్ 2026 సంక్రాంతి దగ్గర పడుతున్నా' ఇప్పటికీ రోడ్ల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రోడ్ల వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 14 నెలలు గడిచినా రోడ్ల వ్యవస్థ ఏ మాత్రమూ బాగుపడలేదు. జనం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. వర్షాలకు రోడ్లన్నీ చెరువులుగా మారిపోతున్నాయి. ఆ గోతుల్లో పడి జనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో రోడ్లన్నీ మృత్యుదారులుగా మారాయంటూ జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో జనాల్లో తీవ్ర ఆగ్రహం వెల్లువెత్తడంతో 2024 ఎన్నికల్లో రెండు జిల్లాల్లో ఒక్క అసెంబ్లీ, పార్లమెంట్ స్థానం కూడా రాకుండాపోయింది. కూటమి ప్రభుత్వం సైతం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు వేల కిలోమీటర్ల వరకూ ఆర్అండ్బి రోడ్లు ఉన్నాయి. విభజిత ఏలూరు జిల్లాలో 1800 కిలోమీటర్ల ఆర్అండ్బి రహదారుల వ్యవస్థ ఉంది. ఏ నియోజకవర్గంలో చూసినా రోడ్ల వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైంది. డిఆర్సి, జిల్లా పరిషత్ సమావేశాల్లో ఎంఎల్ఎలు, స్థానిక ప్రజా ప్రతినిధులు రోడ్ల సమస్యపై లేవనెత్తుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏజెన్సీ ప్రాంతం జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా మారింది. ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వచ్చే రోడ్డు గురించి ఎంత చెప్పినా తక్కువే. వాహనాలు గోతుల్లో పడి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చింతలపూడి నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డు అత్యంత ఘోరంగా మారింది. ఏలూరు నుంచి వంగాయగూడెం రోడ్డు పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఉంగుటూరు నియోజకవర్గంలోని మండల కేంద్రం నిడమర్రు నుంచి అడవికొలను వెళ్లే రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. జీలుగుమిల్లి నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా ఉంది. ఆ రోడ్డు ఈ రోడ్డు అని తేడా లేదు. రోడ్లన్నీ అత్యంత దారుణంగా మారాయి. ఏలూరు జిల్లాలో 1800 కిలోమీటర్ల మేర రోడ్ల వ్యవస్థ ఉంటే సగానికిపైగా ఛిద్రమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం నుంచి జక్కరం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. నరసాపురం మండలంలో పాత నవరసపురం, మేడపాడు వెళ్లే రోడ్డు, మొగల్తూరు, వెంప వెళ్లే రోడ్లు సైతం అధ్వానంగా తయారయ్యాయి. ఆటోలు, బైక్లు సైతం వెళ్లలేని పరిస్థితుల్లో రోడ్లు ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న మాటలకూ క్షేత్రస్థాయిలో పరిస్థితులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా పోయింది. అదిగో.. ఇదిగో నిధులు వచ్చేస్తాయంటూ చెప్పడం తప్ప చిల్లిగవ్వ విడుదల చేయని పరిస్థితి.



దారుణంగా తయారైన భీమవరం, జక్కరం రోడ్డు

ఏలూరు జిల్లాలోనే రూ. 200 కోట్లు అవసరం

ఒక్క ఏలూరు జిల్లాలో రోడ్ల వ్యవస్థ బాగు చేయాలంటేనే దాదాపు రూ.200 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు. పశ్చిమగోదావరి జిల్లాలోనే అదేస్థాయిలో నిధుల అవసరం ఉంది. నిధులు విడుదల చేయకపోవడంతో రోడ్ల పనులు ముందుకు సాగడం లేదు. వైసిపి ప్రభుత్వం రోడ్ల వ్యవస్థను ఏవిధంగా నిర్లక్ష్యం చేసిందో.. కూటమి ప్రభుత్వం కూడా అదేవిధంగా ముందుకు సాగుతోంది. ఇప్పుడు కొత్తగా వచ్చే అక్టోబర్ నాటికి రోడ్లపై చెత్తలేకుండా చేస్తామంటూ ప్రకటనలు గుప్పించారు. దీంతో సంక్రాంతికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామంటూ చెప్పిన విషయం ఏం చేశారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి పేరుతో ఊదరగొట్టడం మినహా రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో రహదారులు అధ్వానంగా తయారై ఎదుర్కొంటున్న ఇబ్బందులతో ఒక కార్పొరేట్ కంపెనీ రాష్ట్రం నుంచి వెళ్లిపోతామంటూ ప్రకటించింది. ఎపిలోనూ ఆ పరిస్థితి ఏర్పడనుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్ల వ్యవస్థను బాగుచేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

పరిశుభ్రమైన జిల్లాకు మొక్కలు నాటాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పాలకొల్లు

పరిశుభ్రమైన జిల్లా ఏర్పాటుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడానికి ప్రజలు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు ఆదిత్య కాలనీ యుహెచ్సి ఎదురుగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన పరిసరాలను ఏర్పాటు చేసి, తద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసేందుకు ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పరిసరాలను, కాలువలను శుభ్రం చేయడం, మొక్కలు నాటడం తదితర పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. వ్యాధులు సోకకముందే వాటిని నివారించడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలంతా తమ ఇంటితోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్థలం లేని ప్రాంతాల్లో టెర్రస్ గార్డెన్లను ప్రోత్సహించాలని సూచించారు. టెర్రస్ గార్డెన్ ద్వారా ఇంట్లోకి అవసరమైన కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ప్రతి ఇంటి ముందూ కనీసం ఒక చెట్టు నాటడం, టెర్రస్ గార్డెనింగ్ ప్రోత్సహించడం ద్వారా స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ విజయసారధి, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఆర్పిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగరాణి

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. అంతర్జాతీయ తీర ప్రాంత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పేరుపాలెం, కెపి.పాలెం గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ను శుభ్రం చేయించారు. బీచ్ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోకుంటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. పర్యావరణ సమతుల్యం లోపించడంతో పశుపక్షాదులతో పాటు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటాయన్నారు. సముద్రం ఎన్నో ఖనిజ సంపదలు, మత్స్య సంపదని కూడా కలిగి ఉందన్నారు. సముద్రం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటే దానిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు ఉపాధి కోల్పోతారని అన్నారు. సేవా పర్వ్ 2025ను ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సముద్ర తీర ప్రాంతం సంరక్షణపై మాట్లాడిన విద్యార్థిని చిరంజీవి లిఖితను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. కలెక్టర్ నాగరాణి ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్తో కలిసి తీరం వెంబడి తాటి విత్తనాలను నాటి నీరు పోశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డిఒ దాసి రాజు, డిఎస్పి శ్రీవేద అరవింద్, జిల్లా నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ.వెంకటేశ్వర్లు, డిపిఒ ఎం.రామ్ నాథ్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా చేనేత అధికారికి అప్పారావు, పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం

మెడికల్ కళాశాలను ప్రయివేటుకు అప్పగిస్తే ఉద్యమం

మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ వ్యతిరేక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

23న దగ్గులూరు మెడికల్ కళాశాల సందర్శనకు పిలుపు

ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నడపాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు అప్పగించి వైద్య విద్య, వైద్యాన్ని పేదలకు అందకుండా చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ వ్యతిరేక రౌండ్ టేబుల్ సమావేశం హెచ్చరించింది. వైద్య విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేసింది. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రయివేటుకు అప్పగిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించింది. ప్రభుత్వం విడుదల చేసిన 590 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నెల 23న దగ్గులూరులో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల సందర్శనకు పిలుపునిచ్చింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. భీమవరంలో ప్రజానీకంతో భారీ నిరసన కార్యక్రమం, జిల్లా మంత్రులకు వినతి పత్రాలు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ కాకుండా ప్రభుత్వమే నిర్మాణం చేపట్టి నిర్వహణ బాధ్యత తీసుకునేంత వరకూ పరిరక్షణ కమిటీ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేసింది. స్థానిక మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మెడికల్ కళాశాలను పిపి పద్ధతిలో ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వమే విద్య వైద్యాన్ని అందించాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. వామపక్షాలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రయివేటుకు అప్పగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గొడ్డలి పెట్టు వంటిదన్నారు. వైద్యానికి, వైద్య విద్యార్థులకు, ప్రజానీకానికి అన్యాయం చేసినట్లేనని విమర్శించారు. వైద్య రంగం ప్రభుత్వ రంగంలో ఉన్న అనేక దేశాల్లో వైద్య సదుపాయాలు ప్రజలకు ఎలా అందించబడుతున్నాయో, కార్పొరేట్ల పరమైతే ప్రజలకు ఎలా ఖరీదుగా మారుతుందో కరోనా సమయంలో అందరికీ తెలిసిందన్నారు. లేకపోతే పరిస్థితి మరోలా ఉంటుందని గుర్తుచేశారు. ప్రభుత్వం తీసుకున్న పిపిపి పద్ధతి నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ఆహ్వానం పలకగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. ఐలు జిల్లా నాయకులు మల్లుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ, సిపిఐ జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

హామీలు అమలు చేయకుండా కాలయాపన..★★★

చెల్లబోయిన రంగారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు



ఎన్నికల్లో అనేక హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. విద్య, వైద్యం ఉచితమని చెప్పి ప్రయివేటుకు అప్పగించాలని చూడడం దారుణం. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ అయితే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారు. వైద్య విద్యను వ్యాపారం చేయడం సరికాదు.

వైద్య విద్యకు రూ.కోటి ఖర్చు..★★★

లంకా కృష్ణమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు



కూటమి ప్రభుత్వం 590 జిఒ జారీ చేసి మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తోంది. విద్య వైద్యం ప్రభుత్వం నడిపితేనే న్యాయం జరుగుతుందని అప్పట్లో ఎన్‌టి రామారావు చెప్పారు. అదే పార్టీలో ఉన్న చంద్రబాబు ఎన్‌టిఆర్ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. వైద్య విద్య చదవాలంటే రూ.కోటి వరకూ అవుతుంది. దీనివల్ల పేద విద్యార్థి తన లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారు.

ప్రభుత్వ ప్రజల జీవితాలతో ఆడుకుంటోంది..★★★

కొల్లాబత్తుల మహంకాళీ, ఎంసిపిఐయు జిల్లా నాయకులు



ఎస్‌సి, ఎస్‌టి, బిసిల అభివృద్ధికి పాటు పడాల్సిన కూటమి ప్రభుత్వం మరింత అణగదొక్కేలా ప్రయత్నించడం దారుణం. పేదలు లబ్ధి పొందకూడదని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. మర్రిచెట్టు ఊర్లలా తయారై ప్రజల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోంది. ప్రభుత్వం పునరాలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.

ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి ..

జెఎన్వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి



గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.8,480 కోట్లు కేటాయించింది. 2000 మెడికల్ సీట్లు ఉన్నదాన్ని 4,910కి పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఐదు కళాశాలలు ప్రారంభం కాగా మరో ఏడు కళాశాలల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. దగ్గులూరు మెడికల్ కళాశాల ఏర్పాటుకు రూ.53 లక్షల చొప్పున 60 ఎకరాల భూమిని సేకరించారు. నిర్మాణానికి రూ.475 కోట్ల వరకూ కేటాయించారు. ఇటీవల మెడికల్ కళాశాలను పరిశీలించాం. ఫౌండేషన్ వరకూ నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది ఆగస్టు-2లోపు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని గత ప్రభుత్వం చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాటు పనులు నిలుపుదల చేసింది. ప్రస్తుతం కళాశాల నిర్మాణాన్ని ప్రయివేటుకు అప్పగిస్తామని, పిపి పద్ధతిలో నిర్మాణం చేపట్టేందుకు జిఒ తీసుకొచ్చింది. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి.

సమస్య పరిష్కారానికి సిపిఎం కృషి అభినందనీయం..★★★

ఇవిసి శేఖర్‌బాబు, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి



సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం కృషి చేయడం అభినందనీయం. మెడికల్ కళాశాల ప్రయివేటుపరం చేస్తే పేదలకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం దారుణం. పునరాలోచించి పేదలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది..★★★

గంటా సుందర్ కుమార్ , దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు



దేశ సంపదను దోచుకున్న బ్రిటీష్ వాళ్లే విద్య, వైద్యాన్ని పేద ప్రజలకు ఉచితంగా అందించారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజల సంపదను, ప్రభుత్వ సంపదను కూడా దోచుకుంటూ విద్య, వైద్యాన్ని వ్యాపారం చేసి కార్పొరేట్లకు అప్పగిస్తోంది. మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణను అడ్డుకునే వరకూ ఉద్యమానికి ప్రజలందరూ ఐక్యంగా సిద్ధం కావాలి.

వైద్యం అందని ద్రాక్షగా మారే ప్రమాదం..★★★

ఎస్. శ్రీనివాస్, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి



వైద్యం అత్యంత ఖరీదైన వ్యాపారంగా మార్చి ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని సంస్థలనూ ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. గతంలో ఔషధ తయారీ సంస్థ ఐటిపిఎల్ ప్రభుత్వ రంగంలో ఉన్నంతకాలం ప్రజానీకానికి ఉచితంగా పెన్సిలిన్ అందించిందని, అనంతరం ఈ సంస్థను ప్రయివేటు వాళ్లకు అప్పగించితే ఇప్పుడు అదే పెన్సిలిన్ మందు 50 రూపాయలకు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రయివేటుకు అనుకూలంగా ప్రభుత్వం..★★★

గాతల జేమ్స్,రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు



ఇప్పటికే విద్య ప్రయివేటు పరం అయ్యింది. ప్రభుత్వ ఆస్తులను కూడా ప్రయివేటుకు అప్పగిస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ కళాశాలను కూడా ప్రయివేటుకు అప్పగిస్తున్నారు. విద్య, వైద్యం మొత్తం ప్రభుత్వ రంగంలో కొనసాగితే పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం ప్రయివేటుకు అనుకూలంగా వ్యవహరించి పేదలను మోసగిస్తోంది.

ప్రభుత్వానిది నిరంకుశ చర్య..★★★

పెండ్ర వీరన్న, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు



పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటు పడాల్సిన ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. ఆ వర్గాలను ఇంకా దుర్మార్గంగా అణిచివేయాలని కుట్ర పన్నుతోంది. ప్రయివేటీకరణ చేస్తే డబ్బున్న వారే చదువుకుంటారు తప్ప పేదలు చదువుకు దూరమవుతారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం పోరాటం చేయడం అభినందనీయం.

మా బిడ్డలకు అన్యాయం..★★★

మత్తే రాజ్‌కుమార్, ఆల్ ఇండియా క్రిస్టియన్ వర్కింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు



గత ప్రభుత్వం పేద విద్యార్థులకు అనుకూలంగా మెడికల్ కళాశాలను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోంది. గతంలో చంద్రబాబు చెప్పిన మాటలకూ చేస్తున్న పనులకూ పొంతన లేదు. మెడికల్ కళాశాలలు ప్రయివేటుపరం అయితే మా బిడ్డలకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం తీరు మార్చుకోవాలి.

వైద్య విద్య నాణ్యత ప్రశ్నార్థకం..★★★

చైతన్య ప్రసాద్, మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డ్ అధికారి



గతంలో చంద్రబాబు యూజర్ ఛార్జీలు పెంచితే ప్రజలు తిరగబడ్డారు. జార్ఖండ్‌లో మెడికల్ కళాశాలను ప్రయివేటుపరం చేస్తే ప్రజల ఆందోళనతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పిపిపి అనేది పెద్ద కుంభకోణం. యాజమాన్యం ఎన్ఆర్ఐ కోటాలో సీట్లకు లక్షలు ఖర్చు పెట్టాలి. నాణ్యమైన విద్య అందుతుందో లేదో ప్రశ్నార్థకమే. మెడికల్ కళాశాల ప్రయివేటుపరం కాకుండా చూస్తేనే ఉపయోగకరం.

పిపిపి విధానం వల్ల నష్టం..★★★

రమేష్ బాబు, బహుజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు



పిపిపి విధానం వల్ల తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. పేద విద్యార్థులకు వైద్య విద్య పూర్తిగా దూరమవుతోంది. దీన్ని అడ్డుకునేందుకు అంతా కలిసిరావాలి. సిపిఎం ఒక అడుగు ముందుకేసింది. వాళ్ల అడుగులో అడిగేసి కలిసికట్టుగా నిలబడితేనే సమస్య పరిష్కారం అవుతుంది.

ప్రభుత్వం పునరాలోచించాలి..★★★

రామని కాన్స్తో, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు



మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు అప్పగించాలని ప్రభుత్వం చేసిన నిర్ణయంపై పునరాలోచించాలి. పేద వర్గానికి వైద్యం, వైద్య విద్య అందేవిధంగా చూడాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. స్వార్థపూరిత నిర్ణయాల వల్ల తీవ్ర నష్టం కలుగుతుంది.

విద్యా విధానం దారుణం..★★★


చోడదాసి గంగయ్య, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నాయకులు



గత ప్రభుత్వం పాఠశాలను విలీనం చేసింది. కూటమి ప్రభుత్వం మరిన్ని మార్పులు తీసుకొచ్చి సర్వనాశనం చేసింది. దీంతో ప్రభుత్వ విద్యా విధానం దారుణంగా తయారైంది. దళిత ప్రాంతాల్లో ఆలయాలు కడతామని చెబుతున్న ప్రభుత్వాలు బడులు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటాయి.

విద్య ఎంతో ఖరీదైంది ..★★★

పి.పూర్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి



కెజి నుంచి పీజీ వరకూ లక్షల ఖర్చు పెట్టి విద్యను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో మెడికల్ కళాశాలను ప్రయివేటుపరం చేస్తే పరిస్థితి దారుణంగా తయారయ్యే ప్రమాదం ఉంది. పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగినట్లే. ప్రభుత్వం స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమం..★★★

టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ సిద్ధపడుతోంది. గత ప్రభుత్వం దోచుకుందని చెబుతున్న కూటమి ప్రభుత్వం నేడు మెడికల్ కాలేజీలను అమ్మేసి ఎంత దోచుకుంటారో చెప్పాలి. తక్షణం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలి. లేనిపక్షంలో ఉద్యమిస్తాం.

సమస్యలపై స్పందించేది సిపిఎం మాత్రమే ..★★★

కె.రాజకుమార్, ఎస్‌సి సెల్ జిల్లా నాయకులు



గత ప్రభుత్వ నిర్ణయాలను రద్దు చేయాలనుకోవడం దుర్మార్గం. పేద విద్యార్థులకు మంచి విద్యనందించాల్సింది పోయి ప్రయివేటుకు అప్పగించడం దారుణం. సమస్యలపై నిరంతరం స్పందించేది సిపిఎం మాత్రమే. రానున్న రోజులు సిపిఎం చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికీ తమ సంపూర్ణ మద్దతు నిరంతరం ఉంటుంది.

పిపిపి అంటేనే అవినీతిమయం..★★★

నన్నేటి పుష్పరాజ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు



మెడికల్ కాలేజీ నిర్వహణ నుంచి ప్రభుత్వం తప్పుకొని ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడం అంటే అతిపెద్ద అవినీతి. దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు వైద్య వృత్తికి పూర్తిగా దూరమవుతారు. ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదు. ప్రజలకు మంచి చేయకుండా అన్యాయం చేయడం ఎంతవరకూ సమంజసం.

నిలిచిన లావాదేవీలు

కొనసాగిన దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

మొగల్తూరు : నూతనంగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాన్ని నిరసిస్తూ చేపట్టిన దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ కార్యక్రమం రెండో రోజు శనివారం మొగల్తూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చేపట్టారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ లేక లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల మొగల్తూరు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొల్లాటి వెంకటేశ్వరరావు, సీలబోయిన సత్యనారాయణ, కడలి త్రిమూర్తులు, పట్టాపు రాము, గుండు నాగేంద్ర, పులపర్తి నాగేశ్వరరావు, కడలి రాజశేఖర్, బొక్క గంగాధర్, కడలి శేఖర్, తూము కృష్ణమోహన్, ముక్కు రాజబాబు, బెల్లకుడుముల రాజేష్, వాసర్ల రవికిరణ్ ఉన్నారు.

ఆకివీడు : దస్తావేజు లేఖర్లు రాష్ట్రస్థాయిలో చేపట్టిన పెన్‌డౌన్ నిరసన కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఆకివీడులో రెండు రోజులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెలవెలబోయింది. 2.0పై అనేక సైబర్ క్రైమ్ ఏర్పాటు అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు. సోమవారం నుంచి యధావిధిగా విధులకు హాజరు కానున్నారు. అయితే ప్రభుత్వం దిగివచ్చే వరకు తాము నిరసనలు చేపడుతూనే ఉంటామని రాష్ట్ర దస్తావేజు లేఖరుల అసోసియేషన్ అధ్యక్షులు కెవి.సుబ్బారావు తెలిపారు.

వీడని వర్షం.. రహదారులు జలమయం..

ఆచంట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు సైతం బోసిపోయాయి. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట, వేమవరం గ్రామాల్లో ఆవాసాల మధ్యలో నీరు చేరాయి. దీంతో ప్రజల రాకపోకులకు అంతరాయం ఏర్పడింది.

నరసాపురం : తీరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల పాటు కుంభవృష్టిగా కురిసింది. దీంతో రోడ్లన్ని జలమయమైయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెయిన్ రోడ్డులో మోకాలు లోతు నీరు నిలిచింది. మరోవైపు గోదావరిపై కారు మేఘాలు కమ్మెయడంతో బండ్ మీదకు వచ్చిన ప్రజలు ఫొటోస్ తీసుకున్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో, భారీ పిడుగులతో తేలికపాటి వర్షం పడింది. దీంతో వారపు సంతకు వెళ్లే ప్రజలు నానా ఇబ్బంది పడ్డారు. వర్తకులు తడిసి ముద్దయ్యారు. పట్నంలో సోమవారం నుంచి శ్రీదేవీ నవరాత్రుల మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకులు పందిళ్ల ఏర్పాటులో తడిచి ముద్దయ్యారు. ఈదురుగాలులతో పట్టణంలో 3 గంటలకుపైగా విద్యుత్ నిలిపివేసారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. భారీ గాలులతో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో నల్ల మబ్బులు అలముకుని వాతావరణం చల్లగా మారి భారీ వర్షం కురిసింది. విద్యుత్ అంతరాయానికి ఆటంకం ఏర్పడింది.

పెనుమంట్ర : పగలంతా ఎండతో బెంబేలు పడ్డ జనానికి సాయంత్రం వేళ కురిసిన వర్షం కాసేపు సేద తీర్చింది. మార్టేరులో కొంత మేర, మండలంలోని ఇతర ప్రాంతాల్లో ఓ మోస్తరు జల్లులు కురిసాయి. ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

గణపవరం : పగలు ఎండతో ఇబ్బందులు పడిన జనం శనివారం సాయంత్రం కారుమబ్బులు, ఉరుములతో కురిసిన వర్షానికి సేదతీరారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆక్వా రైతులు వర్షాల వల్ల మరింత నష్టపోయే పరిస్థితులు కలిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

ప్రపంచ శాంతికి అందరూ పాటుపడాలి

పలుచోట్ల ప్రపంచ శాంతి దినోత్సవం

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రపంచశాంతికి ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి రావాలని వీరవాసరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) అన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవం కార్యక్రమాన్ని రాయకుదురు హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరవాసరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయకుదురు హైస్కూల్ ప్లస్ విద్యార్థులచే శాంతి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం దాసు మాట్లాడుతూ ప్రపంచ శాంతికై ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలను చూసాం.. మూడవ ప్రపంచ యుద్ధం వస్తే జీవరాశి మనుగడకే ప్రమాదమన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావును లయన్స్ క్లబ్ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం లయన్స్ క్లబ్ కార్యదర్శి దేవిరెడ్డి పుల్లారావు, సభ్యులు కోడి శాంతరాజు, దూళిపాళ్ల శ్రీనివాస్, జవ్వాది అప్పారావు, అందే శివ శంకర్‌రావు, పోలిశెట్టి శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ శనివారం గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక చాణక్య కాలేజీలో విద్యార్థులతో ప్రపంచ శాంతి కావాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రపంచ శాంతి ద్వారా మానావాళి మనుగడ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ అడబాల సూరిబాబు, క్లబ్ కోశాధికారి కె.సత్యనారాయణ మూర్తి, లెక్చరర్లు పాల్గొన్నారు.


గణపవరం : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆకివీడు : విద్యార్థులు ఉద్రేకాలకు, ఆవేశాలకు దూరంగా ఉంటూ విద్యాభ్యాసం కొనసాగించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు విద్యార్థులకు సూచించారు. శనివారం దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆకివీడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రపంచ శాంతి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షత వహించారు. చింతారావు, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.సతీష్ ప్రపంచ శాంతి దినోత్సవం చరిత్రను, ప్రపంచ శాంతి స్థాపనలో లయన్స్ క్లబ్ పాత్రను వివరించారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ సీనియర్ సహాయకులు పి.గోపాలరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఓగేశ్వరరావు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ ఇంద్ర వాణి ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శాంతి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, నన్నయ్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లయన్ సంగాని పుత్రయ్య, లయన్ లక్ష్మి ప్రియాంక పాల్గొన్నారు. లయన్ పుత్రయ్య, లయన్ ఇంద్రవాణి మాట్లాడారు. లయన్స్ సభ్యులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ బాబ్జీ కుమారుడు మృతి


అంజన్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి పెద్ద కుమారుడు డాక్టర్ తుపాకులపల్లి అంజన్(55) గుండెపోటుతో శనివారం ఉదయం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఉదయం ఆయనకు ఇంటి వద్ద గుండెపోటు రాగా హుటాహుటిన ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంజన్ మృతదేహాన్ని డాక్టర్ బాబ్జి ఇంటికి తరలించారు. ఈ వార్త తెలిసి పట్టణ ప్రముఖులు, వివిధ రంగాల్లో ప్రముఖులు డాక్టర్ బాబ్జిని పరామర్శించారు. డాక్టర్ బాబ్జి మనవడు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. అమెరికా నుంచి ఇండియా వస్తే తిరిగి అమెరికా వెళ్లే పరిస్థితి ప్రస్తుతం లేదు. దీంతో ఆయన రాక ఆలస్యం అయ్యేలా ఉంది. సోమవారం ఆయన వస్తే అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉంది. డాక్టర్ బాబ్జి మనవడు డాక్టర్ సతీశ 10 సంవత్సరాల క్రితం ఆస్ట్రేలియా లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

వీఆర్‌ఏలకు పే స్కేల్ పెంచాలని ధర్నా

మొగల్తూరు : తెలంగాణ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో వీఆర్‌ఏలకు పే స్కేల్ పెంచాలని వీఆర్‌ఏ సంఘం మొగల్తూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు కోటిపల్లి వేణుగోపాల్, మోటూరి చంటిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వీఆర్‌ఏ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మొగల్తూరులోని వీఆర్‌ఏలు నరసాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి శనివారం తరలి వెళ్లి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గణేష్, కృష్ణ, శ్రీను, ప్రసాద్ ఉన్నారు.

తాడేపల్లిగూడెం : వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వీఆర్‌ఏ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బివివిఎ.వరద, డివిజన్ అధ్యక్షుడు చదలవాడ రమేష్, ఉంగుటూరు మండల ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లిగూడెం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద డివిజన్‌లోని వీఆర్‌ఏలు టెంట్ వేసి ధర్నా నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు గుమ్మళ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి నరసయ్య, అత్తిలి మండల అధ్యక్షుడు లంకపల్లి శ్రీకాంత్, ఇరగవరం మండల కార్యదర్శి కె.కోట్లు, పెంటపాడు మండల అధ్యక్షుడు కె.ధనరాజు, ఉపాధ్యక్షుడు కె.మధు, బయ్యే క్రాంతికుమార్, లక్ష్మీదేవి, రేణు, దేవి, రుబీనా, డివిజన్‌లోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నరసాపురం: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ శనివారం సబ్ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన వీఆర్‌ఏలు ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చి కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఓ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా, డివిజన్ అధ్యక్షులు బుంగా గణేశ్వరరావు, ఎం.ఆదేయిల బాలాజి రావు, డాక్ వరప్రసాద్, గోవింద్, పాపారావు, నర్సింహారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ

కాళ్ల : ఉండి నియోజకవర్గంలో ఓటు చోరీని అడ్డుకునేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో ఓట్ చోర్ - గద్దీ ఛోడ్ - ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశంలో వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ చేపడుతున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

కాళ్ల : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం ప్రతి నియోజకవర్గంలో నూతన మండల అధ్యక్షులను నియమిస్తున్నామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. అధ్యక్షులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కాళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొల్లి సత్యశ్రీనివాస్, ఆకివీడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు కనుమూరు మురళీకృష్ణంరాజు, ఉండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి.కొండలరావు, పాలకోడేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదిరాజు శ్రీనివాసరాజు ఎన్నికయ్యారు.


ఎన్నికైన మండల అధ్యక్షులు

మేడ్ యునైటెడ్ ఆసుపత్రిలో అరుదైన వైద్యం

పాలకొల్లు : ఇటీవల ప్రారంభమైన పాలకొల్లులోని మేడ్ యునైటెడ్ ఆసుపత్రిలో గుండె నొప్పితో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తికి వెంటనే యాంజియోగ్రామ్ చేసి చూస్తే కొంచెం రక్తం గడ్డ కట్టి ఉంది. ఇంజక్షన్‌తో దానిని కరిగించడం జరిగిందని ప్రముఖ గుండె వైద్య నిపుణులు హృదయమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రికి రావడం కొంచెం ఆలస్యమై ఉండుంటే ఆయనకు హార్ట్ ఎటాక్ వచ్చుండేదని మీడియాతో చెప్పారు. పాలకొల్లు మేడ్ యునైటెడ్ హాస్పిటల్‌లో ఫస్ట్ టైం క్యాత్ ల్యాబ్ ఉండటం, అంతేకాకుండా పట్టణంలో 24 గంటలు గుండె సంబంధిత వైద్యులు ఉండటంతో రోగికి ఎంతో మేలు జరిగిందని వారన్నారు. రోగి పరిస్థితి నిలకడగా ఉందని వారు తెలిపారు.


చికిత్స చేస్తున్న వైద్యులు

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

తాడేపల్లిగూడెం : ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్ ఈనెల 20వ తేదీ నుంచి నాలుగు రోజులు పాటు ఈ పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలలో జరుగుతాయని ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమళ్ల సూరిబాబు తెలిపారు. ఈ పోటీలను శనివారం తెల్లవారుజామున ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 మంది క్రీడాకారులు ఈ షటిల్ టోర్నమెంట్ పోటీలకు హాజరవుతారని, పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. షటిల్ టోర్నమెంట్ అధ్యక్షులు అడ్డాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు నాళ్ల సుధాకర్ పాల్గొన్నారు.

ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు అందజేత

కాళ్ల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంగ్లీషులో నైపుణ్యం సాధించడానికి ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ అన్నారు. జక్కరం మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఎస్టియు జిల్లా కార్యదర్శి సిహెచ్.మోహన్ బాబు, ఎస్టియు మండల మహిళా నాయకురాలు భూపతి రాజు గీత, హెచ్‌ఎం పి.వి.రామారావు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.ఐ.రామారావు పాల్గొన్నారు.

మురళీ శ్రీనివాసరెడ్డికి అంతర్జాతీయ అవార్డు

పెనుమంట్ర : మండలంలోని నెగ్గిపూడి మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ సంస్థ అధ్యక్షులు, స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం ఉద్యోగి డాక్టర్ కర్రి మురళీ శ్రీనివాసరెడ్డి సామాజిక సేవలకు గుర్తింపుగా మనం ఫౌండేషన్ నుంచి అంతర్జాతీయ అవార్డు లభించింది. మనం ఫౌండేషన్, వ్యవస్థాపక ఛైర్మన్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో దేశ ప్రధాని మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, జస్టిస్ వేదికలను ప్రొద్దుటూరులో నిర్వహించి నెగ్గిపూడి గ్రామానికి చెందిన మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కర్రి మురళీశ్రీనివాస్ రెడ్డికి పిఎం విజన్ ఆఫ్ భారత్ అవార్డు-2025 గాను సోషల్ మీడియా ద్వారా శ్రీనివాస రెడ్డికి సర్టిఫికెట్ అందజేశారు. శ్రీనివాస రెడ్డికి జాతీయ అవార్డు రావడం పట్ల సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సాకరాజు, ఉపాధ్యక్షులు నరేష్‌కుమార్, బండిమిల్లు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై డిప్యూటీ స్పీకర్‌కు వినతి

కాళ్ల : రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధులు శాసన మండలి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణ రాజుని మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై నోటీసును శనివారం అందజేశారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు ఉద్యోగుల ప్రధాన సమస్యలను వివరించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రతినిధులు నోటీసులో పొందుపరిచిన అంశాలపై సానుకూలంగా స్పందించారు. జెఎసి ప్రతినిధులు షేక్ ఉమర్ అలీషా, వై.సురేష్, షహనాజ్, కీర్తి, డి.విశ్వనాథ్, త్రిమూర్తులు రాజు పాల్గొన్నారు.

మహదేవపట్నం-వెలివర్రు రహదారికి మోక్షం..

రూ.కోటి 52 లక్షలతో నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఉండి : మహదేవపట్నం-వెలివర్రు గ్రామాలను కలుపుతూ రూ.కోటి 52 లక్షల వ్యయంతో నిర్మించే 2.45 కిలోమీటర్ల రహదారికి స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఐయు ప్రాజెక్ట్‌లో భాగంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్మించే ఈ రహదారి 40 రోజుల్లో పూర్తయి మహదేవపట్నం, వెలివర్రు గ్రామ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వణిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, వెలివర్రు గ్రామ సర్పంచి పి.అంజనీ దేవి, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, జనసేన ఉండి మండల అధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా

వీరవాసరం : ఈనెల 22వ తేదీన జరగవలసిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా వేసినట్లు పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వారు పాఠశాలలకు దసరా సెలవులు 22వ తేదీ నుండి ఉత్తర్వులు జారీ చేయడం వల్ల 22వ తేదీన జరగవలసిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల టేబుల్ టెన్నిస్, మాల్కంబ్, ఫెన్సింగ్, బాక్సింగ్, లాన్ టెన్నిస్ ఎంపికలు వాయిదా వేయడం జరిగిందన్నారు. తదుపరి ఎంపికలు జరిపే తేదీ, వేదికలు ప్రకటన ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

మహిళలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : సంపూర్ణ ఆరోగ్యం దేశ సౌభాగ్యమని, మహిళలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం 24వ వార్డులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. మహిళల ఆరోగ్యం కోసమే ఈ ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలను నిర్వమిస్తున్నామని, వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జ్ యర్రా నాని, వైద్యులు నాయుడు, డాక్టర్ దివ్య, డాక్టర్ బద్దె రామకృష్ణ, డాక్టర్ లత, ఎఎంసి వైస్ ఛైర్మన్ బండి రమేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : తల్లులు, ఆడ బిడ్డల పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వేములదీవి సర్పంచి ఒడుగు ఏసుబాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వేములదీవి గ్రామంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. దీన్ని సర్పంచి ఏసుబాబు ప్రారంభించారు. వైద్యులు ఎ. చిరంజీవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గ భవాని, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడికతీత పనులు పూర్తిచేయాలి : ఎంఎల్ఎ

నరసాపురం: సకాలంలో డ్రెయిన్ పూడిక తీత పనులు పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని ఎల్‌బిచర్లలో చేపట్టిన దర్భరేవు డ్రెయిన్ పూడిక తీత పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. డ్రెయిన్‌లో మట్టి తొలగింపు పనులు పూర్తయితే ముంపు సమస్య తీరుతుందన్నారు. పంటలు ముంపు బారిన పడకుండా ఉంటాయన్నారు. రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఎంఎల్ఎ వెంట ఎఎంసి వైస్ ఛైర్మన్ దేశినీడి లక్ష్మి గంగాధర్, గుబ్బల వీరాస్వామి, కటకంశెట్టి సంజీవరావు, కంచర్ల ఫణి కర్త పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తణుకు : గత కొన్నేళ్లుగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ప్రత్యామ్నాయంగా గోస్తనీ ఆనుకుని బండ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం రోడ్డు నిర్మాణ పనులను ఎంఎల్ఎ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా బండ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు తోడు విద్య, వైద్యం అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.

కళాశాలలో విద్యార్థి సంఘం ఎన్నికలు

తణుకు : ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పిజి(అటానమస్) కళాశాలలో 2025-2026 సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలు శనివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ యుఎల్.సుందరీబాయ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల ద్వారా విద్యార్థినులకు పోటీతత్త్వం, నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. విద్యార్థి సంఘ సభ్యులు కె.పద్మజారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్‌గా కె.కీర్తిశ్రీ, సెక్రటరీ ఎం.మహిమాథెరీసా, వైస్ ఛైర్‌పర్సన్ కె.మాధురి, కల్చరల్ సెక్రటరీ బి.షణ్ముఖేశ్వరి, పిజి ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి.జాహ్నవి, జనరల్ కెప్టెన్ జి.అశ్విని భవాని ఎన్నికయ్యారు.

వృద్ధురాలిపై దాడి

మొగల్తూరు : మండలంలోని కాళీపట్నం తూర్పులో ఒక వ్యక్తి వృద్ధురాలిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన బల్ల సూర్య ఆదిలక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన వడ్రంగి పనిచేసే మారోతు శ్రీను చెక్కలు కొనుగోలు చేసే నెపంతో ఇంటికి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న ఆమె మెడలోని సుమారు మూడున్నర కాసుల గొలుసు, చెవి దిద్దులు లాక్కునడు. చెక్కతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆమె కేకల విని సమీపంలో పొరుగువారు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆమె వైద్య చికిత్స నిమిత్తం నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి అత్యవసర వాహనంలో తరలించారు. అనంతరం అక్కడినుండి మెరుగని చికిత్స నిమిత్తం అమలాపురంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి ఆమెకు వరసకు సోదరుడైన కొత్తపల్లి మార్కండేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, డిఎస్‌పి జి.శ్రీవేద సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వైద్య శిబిరంలో 380 మందికి పరీక్షలు



పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేద ప్రజలు ఏ చిన్న సమస్య వచ్చినా సర్దుకునే మనస్తత్వం కలిగి ఉంటారని, వారందరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్య సహాయం అందించేందుకు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు సర్పంచి పోతుల అన్నవరం పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్, విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులచే శనివారం పెదతాడేపల్లి సచివాలయం వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహించి 380 మందికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయాసం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం, కోవిడ్ తర్వాత వచ్చే ఇబ్బందులు, శ్వాస కోశ వ్యాధులు, షుగర్, బిపి, పక్షవాతం, మూర్ఛ, తలనొప్పి నరాలకు సంబంధించిన వ్యాధులు, జనరల్ వ్యాధులు, ఇసిజి టుడే ఎకో, గుండె స్కానింగ్ పరీక్షలు, ఎముకలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వేర్వేరు చోట్ల వైద్య పరీక్ష కేంద్రాలను సర్పంచి పోతుల అన్నవరం, ఉప సర్పంచి అత్తంటి సోమరాజు, ఎంపిటిసిలు గోవింద్, సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలను చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఎమ్‌డి సోమేశ్వరరావు ఆధ్వర్యాన 380 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారులు

వర్షం వస్తే వాహనదారుల అవస్థలు

గోతులు పూడ్చి రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

వాహనదారులకు, ప్రయాణికులకు వడలి గ్రామం నుండి పెనుగొండ వరకు విస్తరించిన ఆర్అండ్‌బి రహదారి గోతులతో నిండి ఉండటం వల్ల వర్షం వస్తే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే రహదారిని మరమ్మతులు చేసి రక్షించాలని సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల వర్షం నీరు నిండిన గోతులలో పడి పలువురు వాహనదారులు కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గోతుల్లో పడిన ఆటో, మోటార్ సైకిళ్ల రోడ్డు పక్కన మార్జిన్‌లో దిగుబడి పలువురు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తక్షణం ఆర్ అండ్ బి రహదారిని సర్వే చేసి గోతులు పూడ్చి రోడ్డు నిర్మాణం చేయాలని, ప్రయాణికులు, వాహనదారుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం వడలి గ్రామ కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.



పెనుమంట్రలో..

పెనుమంట్ర : మండలంలోని జుత్తిగ గ్రామం నుండి పెనుమంట్ర గ్రామం వరకు ఉన్న జిల్లా పరిషత్ రహదారి పెద్ద పెద్ద గోతులతో రోడ్డు పూర్తిగా పాడైపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జుత్తిగ గ్రామ శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ జుత్తుగ గ్రామం నుండి పెనుమంట్ర వరకు నిత్యం రాకపోకలు సాగిస్తామని ఈ రోడ్డే మాకు దిక్కని, ఈ రోడ్డు బాగా పాడైపోయిన కారణంగా రాత్రి సమయంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని తమ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జుత్తిగ గ్రామ ప్రజలు, సిపిఎం శాఖ కార్యదర్శి కర్రి సోమిరెడ్డి, సభ్యులు సుబ్బారావు, వెంకట్రావు, వెంకటేశ్వరరావు, పి.వెంకన్న, పి.సత్యనారాయణ, కె.సుబ్బారావు, జె.వెంకటేశ్వరరావు, బి.రాము, బి.దానేశ్వరరావు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేయాలి


రైతు సంఘం మండల మహాసభ డిమాండ్

వీరవాసరం : అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వీరవాసరం మండల ఐదవ మహాసభ డిమాండ్ చేసింది. శనివారం వీరవాసరం యుటిఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రెడ్డి రామారావు అధ్యక్షతన జరిగిన మహాసభలో జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ పాల్గొని మాట్లాడుతూ భారతదేశ విదేశీయులుపై ట్రంపు అమెరికా ప్రభుత్వం 50 శాతం పన్నులు విధించడం అన్యాయం, దారుణమని అన్నారు. పైకి 50 శాతం కనబడుతున్న ఇది ఆచరణలో ఇతర పన్నులతో కలిసి 59.72 శాతం కానుందన్నారు. ఈ పన్నుల భారం దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందని అన్నారు. ఈ పన్నుల భారం రాష్ట్రంలోని ఆక్వా రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఉత్పత్తి తొమ్మిది లక్షల టన్నులలో 70 శాతం దేశ ఎగుమతుల్లో 60 శాతం ఆంధ్ర నుండే వెళుతుందన్నారు. ఇందులో 25 నుండి 30 శాతం అమెరికాకు వెళుతుందని, ఆంధ్ర నుండి రూ.25 వేల నుండి రూ.30 వేల కోట్ల విలువైన రొయ్యల ఉత్పత్తిలో సింహభాగం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి వెళుతుందని తెలిపారు. సీడ్ ఫీడ్ కరెంటు రాయితీలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహాసభలో బాలం విజయకుమార్, తాళ్లూరి హరిహర లక్ష్మణ్, యాళ్లబండి నారాయణమూర్తి, కిలాడి సత్యనారాయణ, పాల కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

తణుకు : విద్యార్థి దశ నుండే ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తణుకు మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. పిల్లలకు ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1098,100, 15100లకు ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చునని తెలిపారు.

డిఎస్‌సిలో కొలువులు సాధించిన వారికి సన్మానం


సన్మానిస్తున్న ఎంఇఒ బాలయ్య

గణపవరం : మెగా డిఎస్‌సిలో కొలువులు సాధించిన చిన్ననాటి స్నేహితులు జల్లికొమ్మరకు చెందిన మద్దాలనాగన్న, అవిడి ప్రసాద్‌లను శనివారం గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ జి.బాలయ్య మాట్లాడుతూ 2025 స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో అర్హతలు సాధించి న ఇద్దరిని అభినందించారు. హైస్కూల్ హెచ్ఎం గంటావీరవేణి, బాలికల హైస్కూల్ హెచ్ఎం తోట సింహాంద్రి, అప్పన్న రిసోర్స్ పర్సన్ మద్దాల వెంకటేశ్వర్లు, జల్లికొమ్మర హెచ్ఎం పుప్పాల ప్రకాష్ పాల్గొన్నారు. ఎంటిఎస్ టీచర్లుగా మండలంలో పనిచేసిన ఇద్దరు ఉపాధ్యాయులుగా తిరిగి గణపవరం మండలంలో సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

300 మందికి వైద్య పరీక్షలు

నరసాపురం: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరి ప్రారంభించారు. విష్ణు డెంటల్, హర్షా ల్యాబ్ సహకారంతో 300 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేష్ కుమార్, గోపిచంద్, స్వామినాద్ పాల్గొన్నారు.

ప్రకటన
ది. పాలకొల్లు ప్రిన్సిపల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.No. 56/2025 in
E.P.No. 16/2025 in RCC No. 1/2015
Between:
మండెల వీర వెంకటేశ్వరరావు (died)
మండెల సత్యవతి
మండెల శేషుబాబు ...పిటీషనర్స్/DHRS
మరియు
గుండబత్తుల వెంకటేశ్వరరావు ...రెస్పాండెంట్/JDR

పై నెంబరు పిటీషనులో మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు సమన్లు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకముగా సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. సదరు దావా **ది. 10-10-2025 సం॥ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదాకు మీరు వ్యక్తిగతంగా గాని, మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు వాయిదాకు మీరు హాజరు కానియెడల మీ పరోక్షమున దావా గ్రంధము జరుపబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(By Order)
P.D.S.V. Balaji B.Com.B.L.
Palakol Advocate, Palakol
Dt: 19-09-2025 Cell: 94904 33732

వరిలో తెగుళ్లను నివారించాలి

డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : వరిలో ఆశించే తెగుళ్లను రైతులు కనిపెట్టి నివారించాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం క్యాంపస్‌లో జరిగిన రైతులు, అధికారులతో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా వరి పంట పిలకలు కట్టే దశనుండి చిరుపొట్ట దశలో ఉన్నదని, ప్రస్తుతం ఈ పంటపైన అక్కడక్కడా ఆకు ముడుత, ఆకు నల్లి, బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా రైతులు తెలియజేస్తున్నారన్నారు. ఈ చీడ పీడల నివారణపై రైతులను అప్రమత్తం చేయవలసిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ వచ్చే దాళ్వాలో 125 రోజుల పంటకాలం కలిగి, తినడానికి అనువుగా ఉంటూ ఎంటియు 1121తో సమానంగా దిగుబడి వచ్చే రకాలని శాస్త్రవేత్తలు సూచించాలని కోరారు. డాక్టర్ ఎంవి.కృష్ణాజీ కార్యక్రమాన్ని నడిపించారు.

CHEGE OF NAME

I, **GONGALAREDDY SRINIVASREDDY** (New Name), S/o. Venkateswarareddy, Previously Called **SRINIVASA REDDY .G** (Old Name), Resident of D.No:22-35/1, SanthiNagar, Penugonda (V), Penugonda (M), W.G.Dt., Pin-534320, Andhra Pradesh.

I have changed my name from **SRINIVASA REDDY .G** (Old Name) To **GONGALAREDDY SRINIVASREDDY** (New Name) for all practical purposes.

ప్రకటన
ది. పాలకొల్లు ప్రిన్సిపల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.No. 55/2025 in
E.P.No. 16/2025 in RCC No. 1/2015
Between:
మండెల వీర వెంకటేశ్వరరావు (died)
మండెల సత్యవతి
మండెల శేషుబాబు ...పిటీషనర్స్/DHRS
మరియు
గుండబత్తుల వెంకటేశ్వరరావు ...రెస్పాండెంట్/JDR

పై నెంబరు పిటీషనులో మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు సమన్లు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకముగా సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. సదరు దావా **ది. 10-10-2025 సం॥ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదాకు మీరు వ్యక్తిగతంగా గాని, మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు వాయిదాకు మీరు హాజరు కానియెడల మీ పరోక్షమున దావా గ్రంధము జరుపబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(By Order)
P.D.S.V. Balaji B.Com.B.L.
Palakol Advocate, Palakol
Dt: 19-09-2025 Cell: 94904 33732

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి, జంగారెడ్డిగూడెం వారి కోర్టులో,
I.A.No.110/24 in O.S.No. 107/2019
బిట్వీన్:-
A.V. Naresh ...Petitioner/వాది
Vs
1.Smt. Paluri Subbayamma (died)
2.Smt. Vaddlapudi Subbalakshmi & 5 others ...Respondents
To:
R7: Sri. Vaddani Venkanna @ Venkatesh,
S/o. Late. Satyanarayana, R/o. Lakkavaram, Jangareddigudem Mandal, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాగ్రంథంలో దివంగత శ్రీమతి పాలూరి సుబ్బయమ్మ గారి వారసులుగా మిమ్ములని (7వ రెస్పాండెంట్) పార్టీగా చేర్చిన విషయమై మీకు గల అభ్యంతరములను తెలియచేయు నిమిత్తం శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు మీకు సమన్లు పంపినను, వేర్వేరు కారణములు చూపుచు సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పై గ్రంథం ను **ది. 22-09-2025 వ తేదీకి** వాయిదా వేసినారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** గౌరవ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.
(ది. 18-08-2025 వ తేదీన జారీచేసిన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రకటన జారీచేయటమైనది)

యన్.వి.బి.యల్. ఆచారి
జంగారెడ్డిగూడెం న్యాయవాది, జంగారెడ్డిగూడెం
ది.07-09-2025 సెల్: 94402 15126

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి, జంగారెడ్డిగూడెం వారి కోర్టులో,
I.A.No.1050/2024 in
I.A.No.110/24 in O.S.No. 107/2019
బిట్వీన్:-
A.V. Naresh ...Petitioner/వాది
Vs
1.Smt. Paluri Subbayamma (died)
2.Smt. Vaddlapudi Subbalakshmi & 5 others ...Respondents
To:
R3: Sri. Paluri Anjiyya,
S/o. Gangaiah, Bayyanagudem.
R7: Sri. Vaddani Venkanna @ Venkatesh,
S/o. Late. Satyanarayana, R/o. Lakkavaram, Jangareddigudem Mandal, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాగ్రంథంలో 5వ మరియు 6వ రెస్పాండెంట్స్ పేర్లు మరియు రెస్పాండెంట్స్ యొక్క సీరియల్ నంబర్స్ సవరణ నిమిత్తం శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు మీకు సమన్లు పంపినను, వేర్వేరు కారణములు చూపుచు సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పై గ్రంథం ను **ది. 22-09-2025 వ తేదీకి** వాయిదా వేసినారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** గౌరవ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.
(ది. 18-08-2025 వ తేదీన జారీచేసిన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రకటన జారీచేయటమైనది)

యన్.వి.బి.యల్. ఆచారి
జంగారెడ్డిగూడెం న్యాయవాది, జంగారెడ్డిగూడెం
ది.07-09-2025 సెల్: 94402 15126